

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ జయప్రదం చేయండి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కార్మిక కర్షక హక్కులపై చలో పార్లమెంట్ కార్యక్రమం ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నామని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు కార్యాలయంలో చలో ఢిల్లీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. కనీస ఫించన్ రూ.10 వేలు, లేబర్ కోడ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. , కాంట్రాక్ట్, అవుట్ సోర్స్ టైమ్ స్కేల్ స్కీమ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలన్నారు. ఎరువుల సబ్సిడీ పెంచాలని, విద్యుత్ సవరణ బిల్లు 2022 రద్దు చేయాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లో రూ. 2 లక్షల కోట్లు పెంచాలన్నారు. కుటుంబానికి రెండు వందల రోజులు పని కల్పించి, రూ. 600 కూలి ఇవ్వాలన్నారు. పై డిమాండ్ల సాధన కోసం సిఐటియు, కెవిపిఎస్, రైతు సంఘం, కౌలుదారి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే చలో ఢిల్లీని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రామచంద్ర, సిఐటియు జిల్లా కార్యదర్శి డి. భాగ్యలక్ష్మి, కెవిపిఎస్ జిల్లా కో-కన్వీనర్ డి.సి. వెంకటయ్య, సిఐటియు నాయకులు విజయ, సిద్ధమ్మ, ఖాజాబీ, అరుణ సురేఖ ఓబులమ్మ పాల్గొన్నారు.

డిడి అచ్చెన్నది హత్యే

- పోలీసుల దర్యాప్తులో నిర్ధారణ
- ఆరోపణదారుల్లో ఒకరిపైనే కేసు నమోదు!
- మిగిలిన నిందితులకు నేరంలో భాగం లేనట్లేనా?
- రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ పాత్రపైనా ఆరా



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చెన్న హత్యకు గురైనట్లు తేలిసిందే. ఎస్పి కె.కె.ఎన్.అన్బురాజన్ విలేకరుల సమావేశంలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అచ్చెన్న హత్య కేసు ఛేదించిన క్రమాన్ని పరిశీలిస్తే ఈ నెల 12న డాక్టర్ అచ్చెన్న అదృశ్యం కావడం, 14వ తేదీన ఆయన కుటుంబీకులు కడపలోని వెటర్నరీ విభాగానికి చెందిన ముగ్గురు సహ ఉద్యోగులపై పోలీసులకు ఫిర్యాదు చేయడం, 27వ తేదీన పోలీసుల విచారణలో హత్యకు గురైనట్లు నిర్ధారణ కావడం తెలిసిందే. ఈ నెల 12 నుంచి 27వ తేదీ వరకు పోలీసుల విచారణలో చోటుచేసుకున్న నిర్లక్ష్యంపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దళిత సామాజిక వర్గానికి చెందిన జిల్లా అధికారి ఫిర్యాదు చేసిన వెంటనే హత్యాయత్నం కేసుగా పరిగణించి విచారణను వేగవంతం చేయాల్సి ఉందనే వాదన వినిపిస్తోంది. అచ్చెన్న కొందరిపై కేసు నమోదు చేసినప్పటికీ స్పందన లేకపోవడం, ఆయన కుటుంబీకులు ఫిర్యాదు చేసినప్పటికీ ఆశించినరీతిలో విచారణ సాగించకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

నిర్లక్ష్యం ఖరీదు నిండుప్రాణం

అచ్చెన్న వర్సెస్ ఇద్దరు ఎడి, ఓ డాక్టర్ మధ్య నెలకొన్న వివాదాన్ని నెలల తరబడి సీరియల్‌గా కొనసాగించడంలోని జెడి, ఉన్నతాధికారుల వైఫల్యమే హత్య ఉదంతానికి దారితీసిందనే చర్చ నడుస్తోంది. ధర్నాలు, నిరసనలు, గేట్లకు తాళాలు వేయడం, ఎఫ్ఆర్ఎస్ వేయకపోవడం, సరెండర్లు చేయడం, నెలల తరబడి జీతాలు లేక పోవడం వంటి ఘటనల నేపథ్యంలో అప్రమత్తం కావాల్సి ఉంది. మొక్కుబడిగా త్రిసభ్య కమిటీ పేరుతో విచారణ సాగించడం, సత్వరమే చర్యలు తీసుకపోవడంలో చోటుచేసుకున్న నిర్లక్ష్యమే హత్యోదంతానికి దారి తీయడానికి కారణమనే వాదన వినిపిస్తోంది. జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులు వీరందరినీ డిప్యూటేషన్‌పై జిల్లాలోని వివిధ ప్రాంతాలకు పంపించి ఉంటే ఇంతటి దారుణం చోటు చేసుకుని ఉండేది కాదనే వాదన వినిపిస్తోంది.

ఒక్కరిపైనే కేసు నమోదు

అచ్చెన్న హత్య కేసులోని డాక్టర్ సుభాష్ చంద్రబోస్‌పైనే పలు సెక్షన్ల కింద నేరం నమోదు చేయడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మృతుని కుటుంబీకులు ఫిర్యాదులో పేర్కొన్న ముగ్గురు సహ ఉద్యోగుల్లో ఇద్దరికి నేరంలో భాగం లేకపోవడమేమిటనే వాదన ప్రజాసంఘాల నుంచి వినిపిస్తోంది. పైనపేర్కొన్న నిందితునితో కలిసి వీరిద్దరూ తీవ్ర స్థాయిలో విభేదించిన సంగతి తెలిసిందే. వీరితోపాటు రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ పాత్రపై పోలీసులు అనుమానాలు వ్యక్తమవు తుండడం గమనార్హం. పోలీసులు ఆ కోణంలోనూ దృష్టి సారించామని పేర్కొనడం మరిన్ని అనుమానాలకు దారితీస్తోంది.

వీరిద్దరూ నిర్దోషులేనా!

అచ్చెన్న కుటుంబీకులు ఫిర్యాదులో పేర్కొన్న ముగ్గురిలో ఒకరిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మిగిలిన ఇద్దరు సహ ఉద్యోగులు నిర్దోషులేనా, వీరిద్దరూ పెత్తందారీ సామాజికవర్గానికి చెందిన వారు కావడంతోనే ప్రత్యక్ష, పరోక్ష ప్రమేయం కోణంలో విచారణ సాగించలేదా, లేక ఒత్తిళ్ల కారణంగా తప్పించారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్నెళ్లుగా మృతునితో తీవ్రస్థాయిలో విభేదాలు కొనసాగించిన సంగతి తెలిసిందే. నిరసనలు, ధర్నా వంటి చర్యలతో వ్యతిరేకత నేపథ్యంలో పరోక్షంగానైనా హత్య గురించి తెలిసే ఉంటుందనే వాదన వినిపిస్తోంది. ఈలెక్కన హత్య గురించి తెలిసినప్పటికీ పోలీసుల దృష్టికి తేకపోవడమూ నేరమే కదా అనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి కోణంలోనూ విచారణ సాగిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉంటాయనే వాదన వినిపిస్తోంది. ఏదేమైనా అచ్చెన్న హత్య అధికారుల ఉద్దేశపూర్వక నిర్లక్ష్యానికి కారణమనడంలో సందేహం లేదు.

హత్య కేసులో ముగ్గురు అరెస్టు

- మీడియా సమావేశంలో ఎస్‌పి అన్బురాజన్ వెల్లడి



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి అన్బురాజన్

ప్రజాశక్తి - కడప అర్బన్

పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ అచ్చెన్న అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. ఆయనది హత్యగా నిర్ధారించారు. ఈ నేపథ్యంలో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌పి అన్బురాజన్ సోమవార పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్సు హాలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఈనెల 12న పశు సంవర్ధక శాఖలో పనిచేసే అసిస్టెంట్ సర్జన్ సుభాష్‌చంద్రబోస్, కలసపాడుకు చెందిన బావలూరి చెన్నకృష్ణ, గుర్రంకొండకు చెందిన మూడే బాలాజీ నాయక్ డిడి అచ్చెన్నను బలవంతంగా వాహనంలోకి ఎక్కించి రాయచోటికి తీసుకెళ్లారని ఎస్‌పి చెప్పారు. అక్కడ వారు మృతుడికి మద్యం తాగించి అదే రోజు మధ్యాహ్నం గువ్వల చెవురు ఘాట్‌కు చేరుకున్నారని తెలిపారు. ఆ సమయంలో అచ్చెన్న మద్యం మత్తులో అపస్మారక స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. నిందితులు మృతుడి ఛాతిపై బలంగా తన్నడంతో లోయలో పడిపోయారని వెల్లడించారు. దీంతో ఆయన్ను అక్కడే వదిలి వెళ్లిపోయారని పేర్కొన్నారు. నిందితులు సాక్షాధారాలను రూపు మాపేందుకు మృతుడి మొబైల్‌ను తీసుకుని ఫోన్ ఒక చోట, సిమ్ కార్డు మరో చోట పారవేశారని తెలిపారు. ఇదీలా ఉండగా మృతుడి కుమారుడు డాక్టర్ క్లింటన్ చక్రవర్తి ఈనెల 14న తన తండ్రి కన్పించడం లేదని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈనెల 24న గువ్వల చెరువు ఘాట్‌లో అచ్చెన్న అనుమానాస్పద స్థితిలో మృతిచెంది పడినట్లు తెలిపారు. రామాపురం పోలీసులు కేసునమోదు చేసి విచారణ చేపట్టారని, అదేశాఖలో పని చేస్తున్న సుభాష్ చంద్రబోస్‌పై అనుమానం రావడంతో అతన్ని విచారించారన్నారు. ఈనెల 26న సాయంత్రం ముగ్గురు నిందితులు కడప విఆర్‌ఒ ఎదుట లొంగిపోయి తమ నేరాన్ని అంగీకరించారని తెలిపారు. వీరిని విఆర్‌ఒ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించగా జ్యూడీషియల్ రిమాండ్ నిమిత్తం హాజరు పరిచారన్నారు. పశుసంవర్ధకశాఖలో విధుల్లో ఉన్న డాక్టర్ అచ్చెన్న, డాక్టర్ సుభాష్ చంద్రబోస్ మధ్య తీవ్ర మనస్పర్ధలున్నాయని తెలి పారు. ఇదే హత్యకు ప్రధాన కారణమైందని స్పష్టం చేశారు. సమావేశంలో కడప డిఎస్‌పి వెంకట శివారెడ్డి, దిశా పోలీస్ స్టేషన్ ఎస్‌పి వాసుదేవన్ పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి : మందకృష్ణ

కడప/రామాపురం

కడప జిల్లా పశు సంవర్ధశాఖలో డిప్యూటీ డైరెక్టర్ అచ్చెన్నను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. సోమవారం ఆయన అన్నమయ్య జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజును కలిసి వినతి పత్రం అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని, దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. అంతకు ముందు ఆయన రామాపురం మండలంలోని గువ్వలచెరువు ఘాట్ ప్రాంతంలో అచ్చన్న మృతదేహం లభించిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం రామాపురం పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ కొండారెడ్డి లేకపోవంతో రైటర్‌తో మాట్లాడి ఎస్‌పిని కలవడానికి రాయచోటికి వెళ్లారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి

- రెండు 104 అంబులెన్స్‌లు ప్రారంభం



104 వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ గిరీష ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ, ఫిర్యాదుల కోసం జిల్లాకు కేటాయించిన రెండు 104 అంబులెన్సులను కలెక్టర్ గిరీషా పిఎస్, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష పచ్చ జెండా ఊపి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. 104 అంబులెన్స్‌లో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీషా పిఎస్ మాట్లాడుతూ 104 వాహనాలతో ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతాయన్నారు. ముఖ్యమంత్రి ఎంతో ముందుచూపుతో వ్యవహరిస్తూ ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ప్రజలకు మంచి వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ప్రజలందరికీ వైద్య సేవలు అందాలనేది రాష్ట్ర ప్రభుత్వ ఆశయమన్నారు. అనంతరం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు మెరుగైన, వేగంగా వైద్య సేవలందించడానికే 108, 104 ఆంబులెన్స్ వ్యవస్థ ప్రవేశపెట్టారని చెప్పారు. కొత్త టెక్నాలజీతో తయారు చేసిన 104 వాహనాలు జిల్లాకు మంజూరు చేశారన్నారు. ఇప్పుడు జిల్లాకు వచ్చిన ఆంబులెన్స్‌ల వల్ల ప్రతీ గ్రామం, పట్టణంలో ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ కొండయ్య, డిసిహెచ్ ఎస్ డాక్టర్ చంద్రశేఖర్, డిపిఎమ్‌ఒ లోకవర్ధన్, 104 డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎన్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలి : కలెక్టర్

- విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల స్కూటర్లు పంపిణీ



విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల స్కూటర్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- రాయచోటి

విభిన్న ప్రతిభావంతులు నిరుత్సాహ పడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని అందుకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత ఇస్తోందని కలెక్టర్ గిరీష పి.ఎస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'అట్టహాసంగా విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల స్కూటర్ల పంపిణీ' కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు ఎంఎల్‌ఎలు శ్రీకాంత్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ పి. ముంతాజ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్లు, వీల్ చైర్లు అందిస్తోందన్నారు. ఈసారి ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి జిల్లాలో మొదటిసారిగా 57 మందికి రూ.68లక్షల ఖర్చుతో మోటోరైజడ్ స్కూటర్లను అందించడం హర్షించదగ్గ అంశం అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అందించాలని ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని చెప్పారు. విభిన్న ప్రతిభావంతులైనప్పటికీ ఇతరులతో పోటీపడుతూ అన్ని రంగాలలో ముందుకు రావడం అభినందనీయమన్నారు. వాహనాల పంపిణీలో చదువుకున్న వారికి ప్రాధాన్యం ఇచ్చారన్నారు. అలాగే వ్యాపారాలు, జీవనోపాధి కార్యక్రమాలలో ఉన్న వారికి ప్రాధాన్యత ఇచ్చి వాహనాలు పంపిణీ చేశామన్నారు. రాబోయే కాలంలో అర్హులైన అందరికీ మోటారు, బ్యాటరీ సైకిళ్లను పారదర్శకంగా పంపిణీ చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. సిఎస్ఆర్ ఫండ్స్‌లో విభిన్న ప్రతిభావంతులకే అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. మిగతా వారి కంటే భిన్నంగా ఉన్నామని, తక్కువ అని ఆలోచించకుండా విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాలలో ముందుకు వెళ్లాలని సూచించారు. అర్హులైన వికలాంగులకు రూ.3 వేల నుంచి రూ. 5వేల వరకు పింఛన్లు అందజేస్తోందని, వ్యాపారం చేసుకునే వారికి రూ.5 లక్షల వరకు రుణాలు అందజేయడం జరుగుతోందని చెప్పారు. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఎల్లవేళలా పేద ప్రజలకు మంచి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని పేర్కొన్నారు. కుల, మత, వర్గ రాజకీయ భేదాలు చూడకుండా అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అందించాలని ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. జడ్‌పి చైర్మన్ అమర్నాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అన్ని వర్గాల వారికి మేలు చేస్తున్నారని తెలిపారు. మహిళలకు ఆసరా, చేయూత లాంటి కార్యక్రమాలు, విద్యార్థులకు అమ్మ ఒడి లాంటి సంక్షేమ కార్యక్రమాలతో ప్రతి ఒక్కరూ ఆనందంగా సంతోషంగా ఉండాలనే సదుద్దేశంతో పరిపాలన చేయడం జరుగుతోందని చెప్పారు. గతంలో మూడు చక్రాల సైకిల్ ఇచ్చే వారిని వాటి సైకిల్ పెడల్స్ తిప్పుతూ నడపడంలో ఇబ్బంది పడే వారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో విభిన్న ప్రతిభావంతులను దృష్టిలో ఉంచుకొని మోటరైజ్డ్ వాహనాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. పీలేరు శాసనసభ్యులు మాట్లాడుతూ దయా, కరుణ, మానవత్వానికి ప్రతీకగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని చెప్పారు. చాలామంది విభిన్న ప్రతిభావంతులు వాహనాల కోసం దరఖాస్తులు ఇచ్చారని, అర్హులైన అందరికీ వాహనాలు సరఫరా చేయాలని కోరారు. సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్మన్ పి. ముంతాజ్ మాట్లాడుతూ జిల్లాలో మొదటిసారిగా మోటర్ సైకిల్ వాహనాలు అందజేయడం సంతోషకరమన్నారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా మూడు చక్రాల మోటార్ సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వెలుగు సంస్థ వ్యవస్థాపకులు ఉదయ్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడి కిషోర్ బాబు, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ అభివృద్ధికి నిరంతరం కృషి : డిఇఒ

ప్రజాశక్తి-రాయచోటి

స్కౌట్స్ అండ్ గైడ్స్ అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టాలని స్కౌట్ అధికారులను జిల్లా విద్యాశాఖాధికారి సాయిరాం పురుషోత్తం పేర్కొన్నారు. జిల్లా నూతన విద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన సాయిరాం పురుషోత్తంకు స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మదనపల్లి డివిజన్‌లోని కబ్ మాస్టర్లు సోమవారం సాయంత్రం ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పూల బొకేను ఇచ్చి దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ అన్ని పాఠశాలలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. అకడమిక్ కేలెండర్ ఆధారంగా స్కౌట్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో విద్యార్థులలో క్రమశిక్షణ, దేశభక్తి, సేవ భావం అలవడుతుందన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలల్లో సేవలందిస్తున్న కబ్ మాస్టర్ లకు బేసిక్, అడ్వాన్స్ శిక్షణ ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిఇఒకు ఈ సందర్భంగా వారు వినతి పత్రం అందజేశారు. ఏప్రిల్ 1న హార్‌లీ హిల్స్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ఇచ్చే శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, కబ్ మాస్టర్లు ఈశ్వరయ్య, భాస్కర్ రెడ్డి, చంద్రశేఖర్, భూపతి, లక్ష్మీపతి, విద్యాధర్, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పనిసరి

ప్రజాశక్తి-చిన్నమండెం

ప్రతి వాహనదారుడూ లైసెన్సు, ఇన్సూరెన్స్ కల్గి ఉండాలని ఎస్ఐ రమేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారుల లైసెన్సులు, బీమా పత్రాలను పరిశీలించారు. లేని వారికి అపరాధ రుసుం విధించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అలా పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు

మహిళలకు వరం వైఎస్ఆర్ ఆసరా : 'మేడా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకే వైయస్సార్ ఆసరా కింద నిధులు మంజూరు చేయడం జరుగుతోందని శాసనసభ్యులు మేడా వెంకట మల్లిఖార్జునరెడ్డి తెలియజేశారు. సోమవారం పట్టణ పరిధిలోని సిటీ కల్యాణ మండపంలో డ్వాక్రా సంఘాల మహిళలకు వైయస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా సంఘాల మహిళలు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కేక్‌కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ మండల పరిధిలోని 25 పంచాయతీల, 724 డ్వాక్రా మహిళా సంఘాలకు గాను రూ.5.93 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులను డ్వాక్రా సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా పరిపుష్టిగా ఉంటేనే కుటుంబాలు బాగుంటాయని, తద్వారా రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని భావించిన జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆసరా నిధులను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆకేపాటి మురళిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలి వెంకటసుబ్బారెడ్డి, కొండూరు శరత్ కుమార్ రాజు, మిరియాల సురేఖ, వెలుగు ఎపిఎం మదన్మోహన్‌రెడ్డి, సిసిలు, యానిమేటర్లు, డ్వాక్రా మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - రాయచోటి

వేసవి కాలమైనందున కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేశారు. సోమవారం కలెక్టర్ గిరీషా, జెసి తమీమ్ అన్సారీయా కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువ ఉన్న నేపథ్యంలో కలెక్టరేట్‌కు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించినట్లు చెప్పారు. ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ సత్యనారాయణ, కలెక్టరేట్ ఏఒ బాలకృష్ణ, ఏపిఎస్పిడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి జయరాజ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా సి.గంగాప్రసాద్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి పురపాలిక కమిషనర్‌గా సి.గంగాప్రసాద్ సోమవారం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. గతంలో పనిచేసిన రాంబాబు బదిలీపై విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. గంగాప్రసాద్ గతంలో ప్రొద్దుటూరు, వెంకటగిరిలో పనిచేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, డిఇ సుధాకర్‌నాయక్, మేనేజర్ రాధ, ఎఇ కృష్ణారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న బత్యాల చెంగల్రాయుడు

వివేకా హత్య కేసులో దోషులను శిక్షించాలి :'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బాబాయ్ వివేకానందరెడ్డి హత్య కేసులో దోషులను సిబిఐ బయటపెట్టిందని, వారికి వెంటనే శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన టిడిపి శ్రేణులతో కలిసి మార్కెట్, బంగ్రాళ్ల వీధి తదితర ప్రాంతాలలో పర్యటించి వివేకానందరెడ్డి హత్య కేసుపై ముద్రించిన 'జగనాసుర రక్త చరిత్ర' పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ గతంలో రాష్ట్ర పోలీసులపై విశ్వాసం లేదని, విచారణకు సిబిఐని కోరిన జగన్ బాబాయ్ కేసులో సిబిఐ అవసరం లేదని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ఆరు సార్లు ఎంపీగా, నాలుగు దఫాలు ఎమ్మెల్యేగానూ, ఒకమారు ఎమ్మెల్సీగా రాష్ట్రానికి సేవలందించి ప్రజాభిమానాన్ని చూరగొన్న వివేకానందరెడ్డిని అత్యంత కిరాతకంగా హత్య చేసినా నిందితులను పట్టుకోవడంలో ప్రభుత్వం జాప్యం చేస్తూ దోషులను వెనకేసుకురావడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోయిన వివేకా కుమార్తె సునీత హైకోర్టు ద్వారా సిబిఐని ఆశ్రయించి న్యాయం కోసం పోరాడుతుంటే దోషులను తప్పించేందుకు జగన్ ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారని విమర్శించారు. దోషులకు శిక్ష పడేలా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టకపోతే హత్య కేసులో జగన్ ప్రమేయం కూడా ఉందని అనుమానించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 63 ఫిర్యాదులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ స్పందనకు 63 ఫిర్యాదులొచ్చాయని ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. ఫిర్యాదుదారులతో నేరుగా మస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన తమ సమస్యలను స్వయంగా విన్నవించుకున్నారు. వారి సమస్యలు క్షుణ్ణంగా విని, ఫిర్యాదులను పరిశీలించి సంబంధితపోలీస్ అధికారులతో మాట్లాడి ఫిర్యాదులపై చట్టపరంగా విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదే పదే పోలీసు స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండరాదని తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఎంపికైన విద్యార్థులతో కంపెనీ బృందం, కళాశాల నిర్వాహకులు

ప్రాంగణ ఎంపికల్లో 26 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-పీలేరు

ఎంజెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికలో 26 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఐఎల్ఎం కంపెనీ హెచ్ఆర్ గౌస్ బాష తెలిపారు. సోమవారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఎంజెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఈ ఎంపికలను మూడు దశల్లో నిర్వహించామని, మొదట కమ్యునికేషన్ స్కిల్స్ రౌండ్లో 145 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. రెండవ రౌండ్ సామూహిక చర్చల్లో 42 మంది ఎంపిక కాగా, మూడో దఫా హెచ్ఆర్ రౌండ్లో 26 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులకు రూ.2.5 లక్షలు వేతనం ప్యాకేజీగా పొందుతారని కంపెనీ హెచ్ఆర్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంజెఆర్ కళాశాల కరస్పాండెంట్ ఎంపి అవినాష్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఇన్‌ఛార్జులు రెడ్డి ఖాసీం, సి.రవి, కె.సురేష్ పాల్గొన్నారు.

'ప్రతి మండలానికీ రెండు సెంట్రింగ్ యూనిట్లు'



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

ఇళ్ల నిర్మాణం వేగవంతం కోసం ప్రతి మండలానికీ రెండు సెంట్రింగ్ యూనిట్ల రుణం మంజూరు చేయాలని బ్యాంకర్లను కలెక్టర్ గిరీష ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సెంట్రింగ్ యూనిట్ల రుణ మంజూరు, పంచాయతీలు, వార్డుల్లో చలివేంద్రం ఏర్పాటు, స్పందన, 6బి కలెక్షన్, అసైన్మెంట్, బరియల్ గ్రౌండ్స్, గృహ నిర్మాణల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు సంవత్సరంలోగా 14 వేలు పూర్తి చేశామని, ఇంకా 55 వేల ఇళ్లు నిర్మించాల్సి ఉందని చెప్పారు. సెంట్రింగ్ సమస్య వల్ల ఇళ్ల పురోగతి కనిపించడం లేదని, త్వరగా బ్యాంకర్లు పీఎంఈజీపి పథకంలో సెంట్రింగ్ యూనిట్స్ ప్రతి మండలానికి రెండు చొప్పున ఇవ్వాలని ఆదేశించారు. వచ్చేవారం నాటికి రుణమంజూరుతో పాటు గ్రౌండ్ చేయాలన్నారు. ఎండ తీవ్రత, వడగాల్పుల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలతో పాటు రేపటికల్లా అన్ని పంచాయతీల్లో, వార్డులలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. నీటి సమస్య ఎక్కడ తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రత, వడగాలలుపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పైన ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. మండల ఆఫీసులలో తప్పనిసరిగా చలివేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. అసైన్మెంట్స్, బరియల్ గ్రౌండ్స్, గృహ నిర్మాణాల పురోగతిపై ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డిఆర్‌ఒ సత్యనారాయణ, భూముల సర్వే విభాగం సహాయ సంచాలకులు జయరాజ్, హౌసింగ్ పీడీ శివయ్య, డ్వామా పీడీ మద్దిలేటి, కలెక్టరేట్ ఏఒ బాలకృష్ణ, విఎస్ డబ్ల్యూ ఎస్ ఏఒ మనోహర్ రాజు, ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కలకడ

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండల కేంద్రమైన కలకడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తెలుగు)లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ మండల అధ్యక్షులు దగ్గుపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ శిబిరంలో 120 మంది కంటికి సంబంధించిన రోగులు హాజరు కాగా, వారిలో 35 మంది కంటి ఆపరేషన్లకు ఎన్నికైనట్లు తెలిపారు. వీరికి ఉచితంగా కంటి ఆపరేషన్ నిర్వహించి, మందులను పంపిణీ చేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో కంటి జబ్బులతో బాధపడుతున్న వారికి, ఆర్థిక స్తోమతతో బాధపడుతున్న వారికి ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను భవిష్యత్తులో మరెన్నో నిర్వహించి పేదలకు సేవలందించడమే మా ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్ గౌతమిరెడ్డి, లయన్ భాస్కరాచారి, మహేష్ డాక్టర్ బోయపాటి భాస్కర నాయుడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కార్పొరేట్ పాఠశాలల ఆగడాలు అరికట్టాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండలంలోని కార్పొరేట్ పాఠశాలల ఆగడాలను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ తెలిపరు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలు ఈ విద్యా సంవత్సరం పూర్తి కాకముందే రానున్న విద్యా సంవత్సరానికి ముందుగానే అడ్మిషన్లు ప్రారంభించారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఫీజు మానిటరింగ్ కమిటీ వేసినప్పటికీ జిల్లా విద్యా శాఖ అధికారులు దానిని అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. పరిమితికి మించి తరగతి గదిలో విద్యార్థులను ఉంచుతున్నారని, పిల్లల ఆటవిడుపుకు కనీసం క్రీడా మైదానం కూడా లేదని ఆరోపించారు. ఫంక్షన్ల పేరుతో విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు వీటిపై విచారణ జరిపి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు యుగేందర్, హేమంత్, సాయి, ఇస్మాయిల్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.




హరికథ నిర్వహిస్తున్న భాగవతారని కౌసల్య

అలరించిన హరికథ కాలక్షేపం

ప్రజాశక్తి-కలకడ

హరికథా కాలక్షేపం భక్తులను అలారింప జేసింది. మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లి సమీపంలో ఉన్న దేవలంపేటలో వెలిసిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నుండి హరికథా కాలక్షేపంతో మహాభారత యజ్ఞం ప్రారంభమైంది. తిరుపతి వాస్తవ్యులు కౌసల్య భాగవతారచే హరికథా కాలక్షేపం భక్తులకు చేసింది. ఆదివారం వ్యాసమహర్షి జననం, గురించి విపులంగా వివరించి భక్తులు నాకట్టుకుంది. సోమవారం భీష్మ జననం, ప్రతిజ్ఞ హరికథ కాలక్షం ఉంటుందని మహాభారత నిర్వాహకులు మాజీ సర్పంచ్ రామయ్య తెలియజేశారు. కార్యక్రమంలో మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, అబ్బూరి భాస్కర్ నాయుడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని చెన్నయ్యగారిపల్లి గ్రామ పంచాయతీ దళితవాడలో సోమవారం సీతరాముల విగ్రహ ప్రతిష్ట అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వై.సి.పల్లి గ్రామస్తుల ఆహ్వానం మేరకు మల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం మండల ఇన్‌ఛార్జి మేడా మధుసూదన్‌రెడ్డి, ఒంటిమిట్ట ఎంపిపి జనార్దన్‌రెడ్డి, వై.సి.పల్లి ఎంపిటిసి మల్లికార్జున్‌రెడ్డి, రాష్ట్ర బిసి సెల్ డైరెక్టర్ లక్ష్మీనరసయ్య, ఎంపిటిసి పెంచలయ్య, రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రి డైరెక్టర్ హస్తవరం ఉమామహేశ్వర్‌రెడ్డి, గంగయ్య, నాగయ్య, ఓబయ్య, ప్రసాద్,బుజ్జయ్య, మనయ్య, లక్ష్మీనారాయణ, చంద్రయ్య, వేణు యాదవ్, శంకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నివారిద్దాం

ప్రజాశక్తి-గాలివీడు

బాల్య వివాహాలను నివారిద్దాంం, మొగ్గను ఎదగనిస్తాం అన్నస్ఫూర్తితో సోమవారం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలు బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేత పట్టుకొని నినాదాలు చేస్తూ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓ.నిర్మల మాట్లాడుతూ బాల్య వివాహాల చట్టం-2006 సంవత్సరం ఏర్పడిందని తెలిపారు. చిన్ననాటి నుండి బాలికలు వివాహాలు చేసి వారి జీవితాలకు ఎంతో కష్టం ఏర్పడుతుందని పేర్కొన్నారు.బాల వివాహం నిషేదించాలన్నారు. అటువంటి ఆలోచన చేస్తే తల్లిదండ్రులు గాని ఎవరైనా గాని శిక్షార్హులవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమలత, వసుంధర, లక్ష్మీ ప్రసన్న, జ్యోతి, భాస్కర్, 9వ తరగతి ఇంగ్లీష్, తెలుగు మీడియం విద్యార్థులు సుహానిక, శిరీష, తస్మియా, గౌతమి, నిహారిక, అనూష, మనిషా, భానుప్రియ, అమృత, రెడ్డమ్మ, శ్రీవాణి, ఆయేషా, యశస్విని, పలువురు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు

కనులపండువగా ధ్వజారోహణం

ప్రజాశక్తి-వాల్మీకిపురం



ధ్వజారోహణంలో వేదపండితులు

వాల్మీకిక్షేత్రం శ్రీ పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణంతో శోభకృత్ నామ సంవత్సర బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 6 నుంచి 7 గంటల మధ్య మీనలగ్నంలో ధ్వజారోహణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి ఆగమ పండితులు మణికంఠ భట్టార్, ఆలయ ప్రధాన అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, టిటిడి వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు మంత్రోచ్ఛారణలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య సకల దేవతలను ఆహ్వానిస్తూ గరుడ పటాన్ని ఎగురవేశారు. నాగదోషం, సంతాన ప్రాప్తి కోసం మహిళలకు కొడి ప్రసాదం పంపిణీ చేశారు. అంతకుముందు వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం, అలంకరణ, తోమాలసేవ, యాగశాల వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరామస్వామి ఉత్సవ మూర్తులకు ఉయ్యాల మండపంలో ఊంజల్‌సేవ నిర్వహించారు. ధ్వజారోహణంతో సకల దేవతలు, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించినట్లు అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఇఒ వరలక్ష్మి, ఎఇఒ గురుమూర్తి, సూపరింటెండెంట్ మునిచెంగల్రాయలు, ఆలయ అధికారి కృష్ణమూర్తి, సిబ్బంది దుశంత్ కుమార్, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

గజవాహనంపై ఊరేగిన ప్రతాపరాముడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు శ్రీ పట్టాభిరాముడు రాత్రి 8 గంటల నుండి 10 గంటల వరకు గజవాహనంపై తిరుమాడ వీధుల్లో విహరించారు. వాహనం ఎదుట మహిళల పిండికోలాటం స్వాగతం పలికారు. కోలాటాలు, చెక్కభజనలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీ పట్టాభిరాముడు గజవాహనంపై విహరించారు.. భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొడుతూ, కర్పూర హారతులతో స్వామిని సేవించుకున్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారు ముత్యపుపందిరి వాహనం, సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రి హనుమంత వాహనాలపై విహరిస్తారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సినీనటి హీనారాయ్

ప్రజాశక్తి-బి.కొత్తకోట



విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న సినీనటి హీనారాయ్

విద్యార్థులు చదువుతోపాటు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఎంఇఒ రెడ్డి శేఖర్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని విద్యార్థి పాఠశాలలో సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఇఒ రెడ్డి శేఖర్, విశిష్ట అతిథిగా సినీనటి హీనారాయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులు తమలోని సాంకేతిక పరిజ్ఞానాన్ని వెలికితీయడానికి ఇటువంటి సైన్స్ ఫెయిర్లు ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక నమూనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. రోబో, సిలాన్ పెయింటింగ్, సోలార్ రాకెట్ నమూనాలు అదుతేంగా ఉన్నాయని కితాబునిచ్చారు. ప్రస్తుతం సాంకేతిక రంగం ఎంతో అభివృద్ధి సాధిస్తుందని, కావున విద్యార్థులు ఆ రంగంపై దృష్టి సారించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం సినీనటి హీనారాయ్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండి శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రతిభ చాటాలని, ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల రూపొందించిన రోబోట్, మిస్సైల్ వంటి నమూనాలు ఆకట్టుకున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఉమ రమణ, ప్రధానోపాధ్యాయులు మనోహర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో.. ఆరోగ్య సిరులు



రాజంపేట : చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ నిర్మల

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని సిడిపిఒ నిర్మల తెలిపారు. సోమవారం రాజంపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆకేపాడు సెక్టార్‌లో, ఆకేపాడు సచివాలయంలో పోషన్ పఖ్వాడాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు రక్తహీనత, శారీరక పెరుగుదల, ఆరోగ్య ప్రభావం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారంలో చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరించారు. చిరుధాన్యాలను ప్రదర్శించి వాటి ప్రాముఖ్యతను, తీసుకునే విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి, ఐసిడిఎస్ ఆకేపాడు సెక్టార్ సూపర్వైసర్ రాణి, వైద్యాధికారులు, ఎఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **ములకలచెరువు:** మండలంలోని వేపూరికోట అంగన్వాడీ కేంద్రంలో జీరో టు ఆరు సంవత్సరాల పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషన్ పక్వాడాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సిడిపిఒ నాగవేణి సౌజన్యంలో ఎంపిటిసి మార్కిరి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ ఎం.సునీత సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మంజుల కుమారి, ఎఎన్ఎం పద్మ, ఎమ్ఎల్‌హెచ్ పి.రెడ్డి రాణి, మహిళా పోలీస్ అపర్ణ, అంగన్వాడీ కార్యకర్తలు లలితమ్మ, వెంకట రమణమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు. **గాలివీడు :** అంగన్వాడీ కేంద్రాలలో ఉన్న పిల్లలకు పోషన్ పఖ్వాడా వల్ల పిల్లల్లో పోషక శక్తిని పెంచగలమని పిహెచ్ఎన్ సమీతార పేర్కొన్నారు. ఐకెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అంగన్వాడీ టీచర్ల సెక్టార్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల బాల్యం నుంచి పిల్లలకు పోషకాలతో ఆకుకూరలు విటమిన్లు అందిచాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం పెద్దరెడ్డయ్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుహాసిని, అంగన్వాడీ టీచర్లు లక్ష్మీదేవి, ఓబులమ్మ, రత్నమ్మ, జరీనా బేగం, ఆయాలు పాల్గొన్నారు.

మదనపల్లెలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లిలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని మదనపల్లె అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేదిక నాయకులు పి.శ్రీనివాసులు, టి.హరీంద్రనాథ్ శర్మ మాట్లాడుతూ పట్టణంలో రోజురోజుకు జనాభా పెరుగుతూ ఉన్నదని, జనాభా పెరుగుదలతో పాటు వాహణాల వినియోగం కూడా పెరిగిందన్నారు. రోజూ వేల వాహణాలు మదనపల్లె రోడ్లమీదకు వస్తున్నాయని, అనుగుణంగా ట్రాఫిక్ పైన తగినంత చర్యలు తీసుకోకపోవడంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మదనపల్లి అభివృద్ధి వేదిక తరపున ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కొన్ని సూచనలు చేయడం జరుగుతున్నదని తెలిపారు. రోడ్డుకిరు వైపులా ఆక్రమణలు తొలగించాలని, మురుగునీటి కాలువలపై ఫుట్ పాత్‌లు నిర్మించాలని, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయాలని, రోడ్డు డివైడర్ల ను ఏర్పాటు చేయాలన్నారు. జంక్షన్ లలో జీబ్రా లైన్స్ ను వేయాలన్నారు. సిటిఎం రోడ్ లో చింత చెట్ల మధ్యలో వాహనాల పార్కింగ్‌కు చర్యలు తీసుకోవాలని, బిజినెస్ ఏరియా పెద్ద మాల్స్ ఉన్నచోట తప్పనిసరిగా పార్కింగ్ స్థలం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, చేపల మార్కెట్ ను ప్రస్తుతం ఉన్న ప్రాంతం నుంచి డైలీ మార్కెట్ లోకి మార్చాలని తెలిపారు. డైలీ మార్కెట్‌ను వారపు సంతలోకి, వారపు సంతను టమోటా మార్కెట్ యార్డ్‌లోకి, టమోటా మార్కెట్ ను పట్టణ వెలుపల ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కోమటి వాని చెరువు చుట్టూ కంచె ఏర్పాటు చేసి, వాకింగ్ పాత్ ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్నటువంటి రోడ్డును అభివ ృద్ధి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె అభివృద్ధి వేదిక నాయకులు ప్రభాకర్ రెడ్డి, కృష్ణమూర్తి, తిరుపతి రావు పాల్గొన్నారు.

రేపు వారపు సంతకు వేలం పాట

పెద్దమండ్యం: మండలంలో ప్రతి సోమవారం జరిగే వారపు సంతకు గ్రామ పంచాయతీ భవనంలో ఈ నెల 29వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు వేలం పాట నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ వారపు సంత, బస్టాండ్ గేట్లకు 2023-2024 సంవత్సరంనకు వేలం పాట నిర్వహించనున్నారని తెలిపారు. ఆసక్తి గలవారు గ్రామ పంచాయతీ నిర్ణయంచిన ప్రకారం వారపు సంత రూ.లక్ష, బస్టాండ్ గేట్ రూ.50 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని తెలియజేశారు.

ప్రజా సమస్యలపై స్పందించాలి

తంబళ్లపల్లి: ప్రజా సమస్యలపై సచివాలయ ఉద్యోగులు వెంటనే స్పందించాలని ఎంపిడిఒ ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం సచివాలయం ఉద్యోగులు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను గుర్తించిన వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణపు పనులు త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. సచివాలయలపరిధిలో ఇంకా అరహులైన వారు ఉంటే వారికి ఇళ్లు మంజూరు చేసేందుకు వారి సమగ్ర సమాచారంతో ఆన్‌లైన్ పొందుపరచాలన్నారు.

చంద్రబాబు సిఎం కావడం ఖాయం

రామాపురం: రాబోవు2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారం రావడం, చంద్రబాబునాయకుడు సిఎం కావడం ఖాయమని రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్ రమేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కల్పునాయుని చెరువు కస్పా, దళితవాడలలో సోమవారం ఇదేం కర్మ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక, మద్యం, మట్టి దందాలు విపరీతంగా పెరిగిపోయాయని తెలిపారు. తిరుమలలో కూడా గంజాయి అమ్మకాలు చేశారంటే ఈ ప్రభుత్వం ఎంత దారుణంగా దిగజారిపోయిందని ప్రజలకు అర్థం అయిందన్నారు. భూములు ఆన్‌లైన్ చేయాలంటే వైసిపి కార్యకర్తలు చెబితే తప్ప పేదవానికి న్యాయం జరిగేటట్టు లేదని ఆయన అన్నారు. కాపాడాల్సిన పోలీసులు వైసీపీ కార్యకర్తల వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గ్రామాలలో పశువులు మేపుకోవడానికి కూడా సెంటు భూమి లేకుండా వైసిపి కార్యకర్తలు ఆక్రమించుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో మండల యూత్ నాయకులు నాగభూషణ్‌రెడ్డి, దిలీప్‌యాదవ్, చంద్రమౌళి, కృష్ణ, రామచంద్ర, రామకృష్ణ గౌడ్, మహబూబ్ బాషా. చిట్టిరెడ్డి, సత్యనారాయణ, సుబ్బారెడ్డి, వెంకటరామరాజు, వెంకట్రాం రెడ్డి. సుబ్బరాయుడు పాల్గొన్నారు

నేడు ఎమ్మెల్యే రాక

తంబళ్లపల్లి: మండలంలోని మర్రిమాకులపల్లె, కన్నెమడుగు పంచాయతీలలో మంగళవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తారని వైసిపి జిల్లా మహిళా విభాగం కార్యదర్శి జ్యోతి, ఎంపిటిసి మహేష్, పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్ తెలిపారు. ఎమ్మెల్యే గడపగడపకు వెళ్తూ ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, హాజరుకావాలని కోరారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

రాయచోటి: ఈ నెల 4 నుంచి 7 వరకు నేపాల్‌లోని ఖాట్మండ్‌లో నిర్వహించిన సౌత్ ఏషియా ఛాంపియన్ షిప్‌లో అన్నమయ్య జిల్ల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. వారిని సోమవారం కలెక్టపేట్‌లోని స్పందన హాలులో కలెక్టర్ గిరీషా అభినందించారు. మార్షల్ అర్ట్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ షేక్ ఫాహీం మాట్లాడుతూ ఈ సౌత్ ఏసియా ఛాంపియన్ షిప్‌లో పాకిస్థాన్, భూటాన్, శ్రీలంక, నేపాల్, ఇండియా 5 దేశాలు పాల్గొన్నాయి. ఇందులో దాదాపు 900 మంది పాల్గొన్నారనపి, అందులో మాస్టర్ కేటగిరీల్లో జిల్లా సెక్రెటరీ ఫహీమ్ బాషా బంగార పతకం సాధించారన్నారు. అండర్ - 18 బాలికల విభాగంలో పి.హిరణ్మయి బంగారు పతకం సాధించిందని, అండర్ -14 విభాగంలో షేక్. రీయాన్ బంగారు పతకం సాధించారని తెలిఆపరు. పథకాలు సాధించిన క్రీడాకారులు మలేషియాలో నిర్వహించబోయే ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిప్తారు. కార్యక్రమంలో మార్షల్ అర్ట్స్ అసోసియేషన్ స్టేట్ చైర్మెన్ ఇస్మాయిల్, జిల్లా ప్రెసిడెంట్ పాల్గొన్నారు.

స్పందన అర్జీలు త్వరితగతిన పరిష్కరించండి

రాయచోటి: స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ గిరీష ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో కలెక్టర్, జెసి అన్సారియా, డిఆర్ఒ సత్యనారాయణ, భూముల సర్వే విభాగం సహాయ సంచాలకులు జయరాజ్ జిల్లా నలుమూలల ప్రజల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించి, సంబంధిత అధికారులను పిలిచి ఆ అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. స్పందనకు జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజల నుంచి స్వీకరించే అర్జీలను మొక్కుబడిగా కాకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కార మార్గం చూపాలన్నారు. ఆయా దరఖాస్తులు మళ్లీ పునరావృతం కాకుండా నిర్థిష్ట గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పరిష్కరించకుండా మరుగున పడేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని సూచించారు. అర్జీలను సంబంధిత శాఖ అధిపతులకు పంపారు. అర్జీలన్నీ సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఆయా శాఖల్లో తమ కింది స్థాయి అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిశీలించి బియాండ్ ఎస్ఎల్ఎలోకి ఏ ఒక్క అర్జీ వెళ్లకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. గడువు దాటి ఒక్క సమస్య కూడా ఉండకూడదన్నారు. కార్యక్రమంలో వివిధ సమస్యలపై బాధితులు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.



మాజీ సర్పంచ్ గుర్రప్పను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చింతల

మాజీ సర్పంచ్‌పై దాడి అమానుషం :'చింతల'

ప్రజాశక్తి- కలకడ

మండలంలోని దొడ్డిపల్లి మాజీ సర్పంచ్ గుర్రప్పపై తెలుగుదేశం నాయకులు దాడి చేయడం అమానుషమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రరెడ్డి అన్నారు. సోమవారం గోపాలపురంలో మాజీ సర్పంచ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైసిపి కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, పార్టీ అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి, నాయకులు రాజగోపాల్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, సావత్ అలీఖాన్, మస్తాన్ అహ్మద్, సుల్తానీబాషా, వినయ తుల్లా, కుమార్ నాయుడు, శంకర్ నాయుడు, రెడ్డప్ప నాయుడు పాల్గొన్నారు.

శ్రీరామనవమి కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

శ్రీ వరాల ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకల కరపత్రాలను సోమవారం ఆలయ కమిటీ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక శ్రీ సీతారామ కల్యాణం, పట్టాభిషేక మహోత్సవ వేడుకలు కన్నుల పండువలా నిర్వహిస్తామన్నారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు అత్యంత వైభవంగా వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు.



విద్యార్థులకు పరీక్ష కిట్‌ను అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి లయన్స్ క్లబ్ అభయ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ మునిసిపల్ హైస్కూల్‌లో10వ తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లను సోమవారం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు డి.జయదేవ్ రెడ్డి, కోశాధికారి బి.కరుణాకర్‌రెడ్డి, సర్వీసెస్ చైర్మన్ గిరిజా సాయి శేఖర్‌రెడ్డి పాల్గొని పంపిణీ చేశారు. త్వరలో పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు పరీక్షలంటే భయం పోగొట్టి, అవగాహన కల్పించారు. ఉత్తమ మార్కులు సాధించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సుధాకర్ రెడ్డి, సునీల్, పాఠశాల హెచ్ఎం హరికృష్ణ, నాగసులోచన, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట శ్రీరామునికి పట్టు వస్త్రాలు

ప్రజాశక్తి- పుల్లంపేట

పద్మశాలీల ఆధ్వర్యంలో ఏప్రిల్ నాల్గవ తేదీన ఒంటిమిట్ట ఏకశిలా నగరంలోని శ్రీరామచంద్రునికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ జింక విజయలక్ష్మి తెలియజేశారు. మండల పరిధిలోని స్థానిక కళాశాలలో ఆమె మండల పరిధిలోని పద్మశాలీలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 4న ఒంటిమిట్ట ఏకశిలా నగరం నందు వెలసి ఉన్న శ్రీరామ చంద్రునికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్నందున రాష్ట్రంలోని పద్మశాలీలను ఆహ్వానించామన్నారు. పద్మశాలీల హక్కులు అభివృద్ధిపై ప్రత్యేక చొరవ చూపుతానని తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి అఖిలభారత సంఘం కార్యదర్శి నాగ జానకి రామయ్య, సభ సంస్థల కరస్పాండెంట్ నూకల శ్రీరాములు, శివ పార్వతి విద్యాసంస్థల కరస్పాండెంట్ సోము బాలాజీ బాబు, రాంబాబు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

పుల్లంపేట: ఈ ఏడాది ఫిబ్రవరి 5న 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన జాతీయ స్థాయి ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఆదర్శ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ శ్రీహరి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వి.సౌమ్యశ్రీ 80 మార్కులతో ఎస్సీ కేటగిరిలో, ఆర్.గౌతమ్ 90 మార్కులతో ఎస్సీ, వి.జయేంద్ర గౌడ్ 89 మార్కులతో బిసి-బి కేటగిరిలో ఎంపికయ్యారన్నారు. వీరికి సంవత్సరానికి రూ.12 వేలు చొప్పున 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు వరుసగా నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం అందుతుందని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. **పెద్దమండ్యం :** జాతీయ ఉపకార వేత నానికి ఆదర్శ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ రామంజుల నాయక్ తెలిపారు. 8వ తరగతి చెందిన ఇర్ఫాన్, ముజామిల్, చరణ్ తేజ, రెడ్డి జాహ్నవి ఎంపికైనట్లు తెలిపారు. వీరికి ఒక్కొక్కరికి సంవత్సరానికి రూ.15 వేల ప్రకారం నాలుగేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం ఇవ్వనుం దని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

ఘర్షణలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి -కలకడ

ఘర్షణ పడి మహిళను గాయపరిచిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రమేష్ కుమార్ తెలిపారు. మండలంలోని ఏనుగొండపాలెం పంచాయతీ బద్దిరెడ్డిగారిపల్లికి చెందిన వెంకటరమణ భార్య వెంకట లక్ష్మమ్మను, అదే గ్రామానికి చెందిన వెంకటరమణ తమ్ముని భార్య రెడ్డమ్మ కుమార్తె లక్ష్మీదేవి కలిసి పాతకక్షల కారణంగా కొట్టి గాయపరిచినందుకు వెంకటలక్ష్మి గత కొన్ని రోజులుగా మదనపల్లిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో వెంకట లక్ష్మమ్మ భర్త వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు పోలీస్ స్టేషన్లో సోమవారం బాలిక అదృశ్యం కేసు నమోదైంది. సోమవారం ఎస్ఐ డివై.స్వామి మాట్లాడుతూ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం తాతన్నగారిపల్లెకు చెందిన మేకల రామాంజులు కుమార్తె (15) ములకలచెరువు జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుకుంటోందని తెలిపారు. శనివారం ఎప్పటిలాగే స్కూల్‌కు బయల్దేరి వెళ్లిందన్నారు. రాత్రి గడిచినా ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఊర్లలో వెతికినా ఆచూకి లభించలేదని తెలిపారు. స్కూల్ హెచ్ఎం వద్దకు వెళ్లి తమ కుమార్తె గురించి విచారించగా స్కూలు రాలేదని సమాధానం ఇచ్చారన్నారు. బాలిక తండ్రి మేకల రామాంజులు సోమవారం ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేశామని చెప్పారు. అమాకి లభిస్తే 94409715 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.